తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
బుధవారం
10 జూన్ 2026
పేజీలు : 08
Follow :


# మా నాన్నకు వచ్చే ఆదరణ తట్టుకోలేకపోయారు!

## అందుకే అధికారవర్గాలు కుట్రపూరితంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డాయి



- సిట్ ఎదుట విచారణకు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్
- ఈ కేసులో ప్రమేయం ఉన్నవారిపై కఠిన చర్యలకు డిమాండ్





**బోడుప్పల్-జూన్ 9 (జనం సాక్షి) :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మంగళవారం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట విచారణకు హాజరయ్యారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్ నంబర్ ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ఆయనను విచారించినట్లు సమాచారం. విచారణ అనంతరం మీడియా తో మాట్లాడిన అజయ్ యాదవ్.. 2023 అక్టోబర్ నెలలో తన ఫోన్ నంబర్ ట్యాప్ చేసినట్లు సిట్ అధికారులు తనకు వివరించినట్లు తెలిపారు. ఆ సమయంలో తన తండ్రి తోటకూర వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉండటంతో రాజకీయ ప్రయోజనాల కోసం తన ఫోన్‌ను నిఘాలో పెట్టినట్లు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కొనేం దుకు ప్రజల తీర్పును గౌరవించాల్సి ఉంటుందని, కానీ కొందరు అధికార దుర్వినియోగానికి పాల్పడి నిఘా వ్యవస్థలను రాజకీయ అవసరాలకు ఉపయోగించుకున్నారని ఆయన ఆరోపించారు. గతం లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నిక ల్లో లబ్ధి పొందేందుకు అక్రమ మార్గాలను ఆశ్రయిం చిందని విమర్శించారు. తన తండ్రి విజయం దిశగా సాగుతుండటా న్ని తట్టుకోలేక అప్పటి అధికారవర్గాలు కుట్రపూరితంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డాయని ఆరోపించిన అజయ్ యాదవ్, ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు. ప్రజాస్వా మ్యంలో రాజకీయ పోరాటం ప్రజల విశ్వాసం, మద్దతుతో జరగాలని, ఫోన్ ట్యాపింగ్‌లు, నిఘా వ్యవస్థల దుర్వినియోగం వంటి చర్యలకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న అధికారులు, రాజకీయ నాయకులు ఎవరైనా వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని సిట్‌ను డిమాండ్ చేశారు.

## మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి బ్రేక్!

- యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు ఆదేశం
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు
- తదుపరి విచారణ జులై 7కు వాయిదా

2

## శేరిలింగంపల్లిలో నీటి నిల్వలను తక్షణమే తొలగించండి : జెడ్‌సి



2

## ఉపాధి హామీ కూలీల పెళ్లి సందడి

**అడవి పూలు, కూరగాయల దండలతో 31వ వార్షికోత్సవం.**

2



## సార్లు మా సమస్యను పరిష్కరించండి

***హయత్ నగర్, జూన్ 9 (జనంసాక్షి) :*** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీలో డ్రైనేజీ పైప్ లైన్ నులు లీకేజీ కారణంగా మురుగునీరు రోడ్లపై పారడం వలన ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలనీవాసులు మా సమస్యను పరిష్కరించాలని వనస్థలిపురం మాజీ తాజా కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి కి తెలిపారు. వెంకటేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించి జలమండలి అధికారులు ఏఈ విగ్నేశ్వరి, భాను, ప్రకాష్ రెడ్డి, సతీష్, రమేష్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సమస్య ను వెంటనే పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు చంద్రారెడ్డి, వెంకట్ రెడ్డి, నరసింహా రెడ్డి, లక్ష్మణ్, సురేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీ జంక్షన్ - డిఎల్ఎఫ్ కారిడార్ పనులను పరిశీలించిన సైబరాబాద్ సిపి



**శేరిలింగంపల్లి, జూన్ 09 (జనంసాక్షి) :** గచ్చిబౌలి పరిధి ఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న రహదారి అభివృద్ధి మరియు ఫ్లై ఓవర్ నిర్మాణం పనులను మంగళవారం సైబరాబాద్ పోలీస్ బాస్ డాక్టర్ ఎం రమేష్ పరిశీలించారు. ఇందులో భాగంగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుండి డిఎల్ఎఫ్ జంక్షన్ వరకు కొనసాగుతున్న ఫ్లైఓవర్ పనులను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం పనులు, రహదారి అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాల్సిందిగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సిపి రమేష్ సూచించారు. నిర్మాణం కొనసాగుతున్న సమయంలో ప్రయాణికులు, వాహనదారులు, స్థానిక ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అటు సిఎంసి అధికారులు, ఇటు ట్రాఫిక్ పోలీస్ విభాగం అధికారులు సమన్వయంతో ముందుకు సాగి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ఎత్తిచూపారు. రాబోయే మూడు నెలల పాటు స్థానికంగా ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీని అమలు చేసి అవసరమైన ప్రాంతాలలో ట్రాఫిక్ డైవర్షన్లను ఏర్పాటు చేసి ఇబ్బందులను అధిగమించాలని కోరారు. ఫ్లై ఓవర్ నిర్మాణపు పనులు పూర్తయితే వాహనదారులకు, ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని, ప్రయాణం వేగంగా సాగిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్.హెచ్.ఓ సురేష్, సిఎంసి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదోడిపై ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులుం

- రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం బాధాకరం
- ఫీజుల దోపిడిపై క్షేత్రస్థాయిలో నిలదీస్తాం
- ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది
- నిరుపేద విద్యార్థుల చదువులకు అండగా నిలుస్తాం
- బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్

2

# పేదోడిపై ప్రైవేట్ విద్యా సంస్థల ఫీ జూలుం

- రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం బాధాకరం
- ఫీజుల దోపిడిపై క్షేత్రస్థాయిలో నిలదీస్తాం
- ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది
- నిరుపేద విద్యార్థుల చదువులకు అండగా నిలుస్తాం
- బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్



**హయత్ నగర్, జూన్ 9 (జనం సాక్షి) :** ఎల్‌కెజి నుండి పీజీ, ఇంజనీరింగ్ కాలేజీలలో వేలు, లక్షలు రూపాయలు వసులు చేస్తూ సామాన్యులను పీడిస్తున్న ప్రైవేటు యాజమాన్యం పై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పత్రికా ప్రకటన లో బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. ఫీజుల నియంత్రణ ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు కేవలం ప్రభుత్వ నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలి. నిబంధనలు ఉల్లంఘించి లక్షల్లో ఫీజులు గుంజే యాజమాన్యం పై క్రిమినల్ కేసు పెట్టాలి, వారిపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని తెలిపారు.

మధ్యతరగతి కుటుంబాలపై ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ఫీజుల వల్ల మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. వేలు, లక్షల ఫీజులు కట్టలేని దీన స్థితిలో సామాన్య ప్రజలు తమ పిల్లల చదువులను మధ్యలోనే ఆపేయాల్సిన పరిస్థితి వస్తున్నాయని, దీనికి ప్రభుత్వ పర్యవేక్షణ లోపమే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వము జీవోలను కేవలం కాగితాలకే పరిమితం కాకుండా తాము నిర్ణయించిన ఫీజులను మాత్రమే ప్రవేట్ సంస్థలు వసూలు చేసేలా క్షేత్రస్థాయిలో కఠినమైన నిఘా పెట్టాలి. నిబంధనలను ఉల్లంఘించి విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలి.

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విద్య రంగం దోపిడిపై ప్రభుత్వం, అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తుందని ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. సామాన్య, మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ ఫీజు నియంత్రణపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను. ఫీజులు కట్టలేదని సాకుతో విద్యార్థులను ఇబ్బంది పెడితే, విద్యార్థుల తరపున పీపుల్స్ ఫెడరేషన్ ప్రత్యక్ష పోరాటం నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రవేట్ విద్యాసంస్థలు పుస్తకాలు, యూనిఫామ్ ల పేరుతో సామాన్య ప్రజల రక్తాన్ని పిండుతున్న కార్పొరేటర్ స్కూలు యాజమాన్యం, ప్రభుత్వం పైన బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ఎల్లప్పుడూ ప్రశ్నిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు.

# మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి బ్రేక్!

- యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు ఆదేశం
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు
- తదుపరి విచారణ జులై 7కు వాయిదా

**సికింద్రాబాద్ (జనం సాక్షి):** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవన నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా శంకుస్థాపన చేసిన ఈ భవన నిర్మాణ స్థలంలో తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు యథాతథ స్థితి (స్టేటస్ కో)ని కొనసాగించాలని తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడ ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ భవన నిర్మాణాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో మొత్తం ఐదు రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై మంగళవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ధర్మాసనం.. పిటిషనర్ల తరఫు న్యాయవాదుల వాదనలను ఆలకించింది. అనంతరం ఈ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను జులై 7వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన కొద్దిరోజుల్లోనే న్యాయస్థానం స్టేటస్ కో విధించడంతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణంపై ఉత్కంఠ నెలకొంది. జులై 7న ప్రభుత్వం దాఖలు చేయబోయే కౌంటర్ ఆధారంగానే ఈ ప్రాజెక్టు భవిష్యత్తు ఖరారు కానుంది.

# శేరిలింగంపల్లిలో నీటి నిల్వలను తక్షణమే తొలగించండి : జెడ్.సి



**శేరిలింగంపల్లి, జూన్ 09 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి జోన్ పరిధిలో లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులపై నిలిచి ఉన్న వర్షపు నీటిని తక్షణమే తొలగించాలని ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులను జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి గచ్చిబౌలి ప్రధాన రహదారి పూర్తిగా జలమయమైన నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ కార్యాలయం వద్ద పరిస్థితిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా ఖాజా గూడా చెరువులోకి వర్షపు నీరు సులువుగా వెళ్లకుండా అక్కడక్కడ ఏర్పడిన అడ్డంకులను జెడ్సి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తక్షణమే హిటాచి మెషిన్ ను, ఎక్స్ కవేటర్ సహాయంతో వర్షపు నీరు అడ్డంకులను తొలగించి ఎక్కడా వరద నీరు నిలవకుండా నేరుగా చెరువులోకి కలిసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సాధారణ ప్రజలకు, ప్రయాణికులకు, ఉద్యోగుల కు రవాణా పరంగా ఎలాంటి అడ్డంకులు తలెత్తకుండా ట్రాఫిక్ సజావుగా సాగేలా ముమ్మర చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా క్రింది స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో జెడ్సి వెంట శేరిలింగంపల్లి ఉప కమిషనర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉన్నారు.

# ఉపాధి హామీ కూలీల పెళ్లి సందడి





**అడవి పూలు, కూరగాయల దండలతో 31వ వార్షికోత్సవం**

**తాండూరు జూన్ 9(జనంసాక్షి) :** ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల మధ్య ఆత్మీయతకు అద్దం పట్టే ఘటన తాండూరు మండలంలో చోటుచేసుకుంది. అంతారం గ్రామానికి చెందిన జంగని సుగుణమ్మ, మొగులయ్య దంపతుల వివాహ వేడుక ఉన్నట్లు గుర్తించిన తోటి ఉపాధి హమి కూలీలు అడవి పువ్వులు సేకరించి అక్కడే ఉన్నా ఓ పొడవాటి సొరకాయ దండను ఏర్పాటు చేసి వివాహ వేడుక జరిపించారు. ఉపాధి కూలీ జంట తమ 31వ పెళ్లి వార్షికోత్సవాన్ని తోటి కూలీల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలో బంగారు, వెండి దండలు కాకుండా అడవి పూలు, కూరగాయలతో తయారు చేసిన దండలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉపాధి పనులకు వెళ్లే సమయంలో దొరికే అటవీ పుష్పాలు, తోటలో పండిన కూరగాయలతో దండలు అల్లి ఆ దంపతులను సత్కరించారు. కష్టజీవులైన తోటి కూలీలంతా ఒక్కచోట చేరి, నూతన దంపతులను ఆశీర్వదించినట్టుగా వారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉన్నదాంట్లోనే సంతోషాన్ని వెతుక్కునే వీరి జీవన శైలి, ఒకరిపై ఒకరికి ఉన్న ప్రేమాభిమానాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పని ప్రదేశంలోనే కుటుంబంలా కలిసి మెలిసి ఉండే తత్వాన్ని ఈ వేడుక చాటిచెప్పింది. డబ్బు, హోదాతో పనిలేకుండా ఆత్మీయతతో చేసుకున్న ఈ వేడుక స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో పెండ సాయమ్మ. పద్మమ్మ. మాన్యమ్మ. ప్రేమిల. సంగెమ్ సావిత్రిమ్మ. బొడ్డే మాన్యమ్మ. సత్యమ్మ. సువర్ణ. సుగుణమ్మ. సంజీవప్ప. మెజస్ ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ " రాజ్యాంగ శిల్పి" : మాజీ సర్పంచుల నేత కే.రాజిరెడ్డి

**దోమ జూన్ 09 జనంసాక్షి :** దేశానికి సమానత్వం. స్వేచ్ఛ. సౌభ్రాతృత్వం కలిగిన రాజ్యాంగాన్ని రాసి ఇచ్చిన రాజ్యాంగ శిల్పి అంబేద్కర్ అని వికారాబాద్ జిల్లా మాజీ సర్పంచుల నేత దోమ మాజీ సర్పంచ్ కె రాజిరెడ్డి అన్నారు మంగళవారం దోమ మండల కేంద్రంలో ఈ నెల పదమూడో రోజు పూడూర్ మండలం మాటుగూడెం లో అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణకు సంబంధించి గోడ పత్రిక విడుదల కార్యక్రమం అంబేద్కర్ సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. చదువుకు దూరం చేసిన సమాజం తో పోరాడిన ప్రపంచస్థాయి విద్యా వేత్త విగ్రహా ఆవిష్కరణకు దోమ మండలం నుండి అత్యధికంగా వెళదామని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి నియోజకవర్గ అంబేద్కర్ సంఘం నాయకులు మంచనపల్లి శ్రీనివాస్, రాములు,ఆంజనేయులు,డప్పు రమేష్, నర్సింలు, బద్రి, వెంకటయ్య, విజయ్ కుమార్ రెడ్డి, బొంపల్లి వెంకటేష్, అంబేద్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఆరోగ్య సేవలే లక్ష్యం

- సమయపాలన పాటించాల్సిందే... అలసత్వం వహిస్తే చర్యలు
- హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ప్రజలందరికీ నాణ్యమైన, మెరుగైన ఆరోగ్య సేవలు అందించ డమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్‌వోగా నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మంగళవారం జిల్లా కార్యాలయంలో అధికారులతో తొలి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాధ్యతల నిర్వహణలో వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్‌ను సకాలంలో పూర్తి చేయాలని, అనవసరంగా ఏ ఒక్క ఫైల్ పెండింగ్‌లో ఉంచకూడదని ఆదేశించారు. నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయిలో వైద్య సేవల అమలు తీరుపై ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా విధులకు హాజరుకావాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. శ్రీధర్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బోడుప్పల్ ప్రాంత అభివృద్ధే మా లక్ష్యం

- మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్
- రూ.80 లక్షలతో బీపీఆర్-ఆర్ఎన్ఎస్ మార్గంలో డ్రైనేజీ పనుల ప్రారంభం



**బోడుప్పల్-జనంసాక్షి :** బోడుప్పల్ సర్కిల్‌ను సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. మంగళవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బీపీఆర్ కాలనీ నుంచి ఆర్ఎన్ఎస్ కాలనీ ప్రధాన మార్గం వరకు రూ. 80 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ పనులు దోహదపడ తాయని చెప్పారు. నగర విస్తరణకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. బోడుప్పల్ ప్రాంత అభివృద్ధికి ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి రహదారులు, డ్రైనేజీలు,పార్కులు,వీధి దీపాలు వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని అజయ్ యాదవ్ తెలిపారు. ప్రజల సహకారంతో బోడుప్పల్‌ను ఆదర్శవంతమైన సర్కిల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్,బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి,బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,సీనియర్ నాయకులు బొమ్మకు రమేష్,మాజీ కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ,బొమ్మక్ కళ్యాణ్ కుమార్,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జీ.సమతా యాదవ్,యువజన కాంగ్రెస్ నాయకుడు అసర్ల బీరప్ప,పడతం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే వంతెన పనుల్లో వేగం.. విద్యుత్ తీగలకు మరమ్మతులు

**ఘట్కేసర్, జూన్ 09 (జనంసాక్షి)** : రైల్వే వంతెన పనుల్లో భాగంగా పాత కల్కి హాస్పటల్ దగ్గర వేస్తున్న స్లాబ్‌కి విద్యుత్ తీగలు అడ్డు రావడంతో కాంట్రాక్టర్ సత్తిరెడ్డి మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ తెలపడంతో విద్యుత్ తీగలు మరమ్మత్తుల చేయించడం జరిగింది. కాంట్రాక్టు సత్తి రెడ్డికి ప్రభుత్వం నుండి బిల్లుల సమస్యపై, అబ్బాసాని యాదగిరి యాదవ్ జోక్యంతో బిల్లుల సమస్య తీరిపోయినట్లయింది. అలాగే విద్యుత్ తీగలు అడ్డొస్తున్నాయి అని తెలుపడంతో తొలగించారు. రైల్వే వంతెన పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, ఘట్కేసర్ ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా పడుతున్న బాధ తీర్చాలని, రైల్వేవంతెన పనులు వేగవంతం చేయాలని ఈ సందర్భంగా తెలియచేసారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ములుగురం రామ్మోహన్,నాగభూషణం చారి,సారా శ్రీనివాస్ గౌడ్, శివరాత్రి సురేష్, తస్నీరు హరీష్, రామకృష్ణ, శివశంకర్, విద్యుత్ కాంట్రాక్టర్ మహంకాళి నవీన్ పాల్గొన్నారు.





## కుమార్తె ఇంటి నుంచి బయలుదేరిన వృద్ధుడు అదృశ్యం



**పోచారం, జూన్ 9 ( జనం సాక్షి )** : కుమార్తె ఇంటి నుంచి స్వగృహానికి వెళ్తానని చెప్పి బయలుదేరిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, చింతల్ భగత్‌సింగ్ నగర్‌కు చెందిన తంపుల కొమరయ్య (75) తన భార్య కమలమ్మతో కలిసి కుమార్తె మాదెల్ల రాధికను చేయి విరిగినందున ఆమెను పరామర్శించేందుకు మే 31న ఆమె ఇంటికి వచ్చారు. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నారు. ఈ నెల 8వ తేదీ ఉదయం సుమారు 10.30 గంటల సమయంలో స్వగృహానికి వెళ్లాల్సి ఉందని చెప్పిన కొమరయ్య, తన భార్యను కుమార్తె ఇంటి వద్దే ఉంచి ఒంటరిగా బయలుదేరారు. అయితే రాత్రి వరకు ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అనంతరం బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద ఆరా తీయడంతో పాటు పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. ఇంటినుంచి బయలుదేరే సమయంలో కొమరయ్య నీలం రంగు చొక్కా, గోధుమరంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## అంతర్జాతీయ లాక్రాస్‌కు ఎంపికైన గోపికకు రూ.లక్ష ప్రోత్సాహం

**చేవెళ్ల, జూన్ 09 (జనంసాక్షి)** క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడకారులను అభినందించడంతోపాటు ప్రోత్సహించాల్సిన అవరం ఎంతైనా ఉందని చేవెళ్ల ఏసీపి కిషన్ గౌడ్, చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ సమతావెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల ఏసీపీ కార్యాలయంలో చేవెళ్ల ఏసిపి కిషన్ గౌడ్ స్వగ్రామం నల్గొండ జిల్లా దామరచర్ల మండలం, వాడపల్లి గ్రామానికి చెందిన పి. గోపిక అంతర్జాతీయ లాక్రాస్ పోటీలో పాల్గొనేందుకు ఎంపిక అయ్యింది. ఈనెల 17వ తేదిన ఉత్తర్ ప్రదేశ్ సెలెక్ట్ కమిటీ ద్వారా ఫైనల్లో ఆస్ట్రేలియాలో అడేందుకు వెళ్లనుంది. అయితే లాక్రాస్ పోటీలో ప్రతిభ చాటిన గోపికను చేవెళ్ల ఏసీపీ ఆధ్వర్యంలో చేవెళ్ల ఏసిపి కార్యాలయంలో ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి ప్రోత్సహించేందుకు చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ సమతా వెంకట్ రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజా అగిరెడ్డిలు ఇరువురు కలిసి రూ.50 వేలు నగదు అందించారు. అలాగే హైదరాబాద్ నగరంలోని పంజాగుట్టకు చెందిన గోవర్ధన్ లోగికార్ రాజేశ్వర్ రూ. 50 వేలు అం దజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ లాక్రాస్ పోటీలకు ఎంపికైనా క్రీడాకారిణీని ప్రోత్సహించేందుకు ఆర్థిక సహాయం అందించడం గొప్ప విషయమన్నారు. క్రీడకారులు దేశం తరుపున అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో ఆడటం దేశానికి గౌర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలరు కృష్ణనాయక్, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, నాయకులు అత్తెల్లి రవీందర్ రెడ్డి, కావడి రాజవర్ధన్ రెడ్డి, పీసరి దామోదర్ రెడ్డి, బుర్ర మహేష్ కుమార్, రవి కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం వార్షికోత్సవం

**అమ్మవారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న సిఎల్ శ్రీనివాస్ యాదవ్**

**తలకొండపల్లి జూన్ 09(జనంసాక్షి):** తలకొండ పల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని రజకుల,కుల దైవం శ్రీ శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయం నాలుగో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం కన్నుల పండువగా జరిగాయి. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో పూజించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి కళ్యాణం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తలకొండపల్లి మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్,వెల్జాల్ సర్పంచ్ వానరాశి రాములమ్మ తనయుడు వెంకటేష్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.ఈ సందర్భంగా సిఎల్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..ఆధ్యాత్మిక చింతనతోనే మనసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు.భక్తుల పాలిట కొంగుబంగారంగా రేణుక ఎల్లమ్మ తల్లి నిలిచిందన్నారు.అనంతరం రజక సంఘం నాయకులు మాట్లాడారు.ఆలయ నిర్మాణానికి సిఎల్ శ్రీనివాస్ యాదవ్ రూ,1 లక్ష అందించడం మరువలేనిదని తెలిపారు. నాయకులును శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ మాజీ సభ్యులు ముజీబుర్ రహెమాన్,రజక సంఘం నాయకులు కల్వకోలు వెంకటయ్య, తిరుపతయ్య,జర్నలిస్ట్ యాదగిరి, శ్రీనివాస్, శ్రీశైలం, రాజు,నరేష్,సిహ్మాయ్య,వెంకటేష్,రవి,యాదయ్య,నర్సింహ,తది తరులు పాల్గొన్నారు.

# మహిళా ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

**మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు శంషాబాద్‌లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభం**

**శంషాబాద్, జూన్9(జనంసాక్షి)** : మహిళల ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన నడిపించే వినూత్న పథకాన్ని అమలు చేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం శంషాబాద్ లో, ఈ పథకం కింద మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించి బస్సుల కొనుగోలుకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల ద్వారా టీజీఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన కేటాయించిన 400 కొత్త బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా శంషాబాద్‌లో స్థానిక మహిళా సంఘానికి చెందిన ఆర్టీసీ అద్దె బస్సును ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రిబ్బన్ కట్ చేసి, పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు శాశ్వత ఉపాధి, ఆర్థిక స్వావలంబన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మహిళా సంఘాలు బస్సుల యజమానులుగా మారడం ద్వారా వారికి నిరంతర ఆదాయం లభించడంతో పాటు రవాణా రంగంలో మహిళల భాగస్వామ్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా బస్సుల నిర్వహణ వల్ల టీజీఆర్టీసీకి అవసరమైన బస్సుల లభ్యత పెరగడమే కాకుండా మహిళల ఆర్థిక స్థితి బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, మాజీ సర్పంచ్ దండు ఇస్త్రారీ, మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, నాయకులు చంద్రారెడ్డి, నీరటి రాజు ముదిరాజ్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకోండి : జోనల్ కమిషనర్‌కు వినతి

**అల్వాల్, జూన్ 9 (జనంసాక్షి)** : అల్వాల్, మచ్చబొల్లారం పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించి, సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ తోట లక్ష్మీకాంత రెడ్డి, మచ్చబొల్లారం ఎంఎంసీ 190, 191 డివిజన్ల ఇన్‌ఛార్జ్ మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్‌లు కోరారు. మంగళవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌ను వారు కలిసి ఉమ్మడిగా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వసతులు, క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, అర్బన్ బయోడైవర్సిటీ నిధుల కేటాయింపు, పార్కుల ఆధునీకరణపై కమిషనర్‌తో రాజ్ జితేందర్ నాథ్ సుదీర్ఘంగా చర్చించారు. అలాగే మచ్చబొల్లారం మార్కెట్ ఆధునీకరణ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, అల్వాల్ జంక్షన్ సుందరీకరణతో పాటు ఇందిరాగాంధీ విగ్రహ పునఃస్థాపన అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ.. ప్రతిపాదిత పనులన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో, దశలవారీగా పూర్తి చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.





# మట్టి రోడ్డుకు మరమ్మత్తులు

## గ్రామ సర్పంచ్ కోర్ర శిరీష కృష్ణ నాయక్

**తలకొండపల్లి జూన్09(జనంసాక్షి):** తలకొండపల్లి మండల పరిధిలోని హర్యానాయక్ తండ పంచాయతీకి చెందిన సూర్య నాయక్ తండా నుంచి పడకల్ బీటి రోడ్డు వరకు ఉన్న సుమారు కిలోమీటర్ దూరం రోడ్డు పూర్తిగా కంకర తేలి గుంతల మయం కావడంతో సర్పంచ్ కోర్ర శిరీష కృష్ణ నాయక్ రోడ్డుపై మొరాన్ని పోయించారు.వర్షాలకు రోడ్డుపై కంకర తేలి,భారీ గుంతలు పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.దీంతో గ్రామ ప్రజలు వాహనదారుల విజ్ఞప్తి మేరకు సోమవారం రోడ్డుపై (మొర్రం)మట్టి పోయించారు.కంకర తేలి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.ప్రమాదాలు జరుగకుండా తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా హర్య నాయక్ తండా,సూర్య నాయక్ తండా ప్రజలు, నాయకులు, సర్పంచిని పాలకవర్గ సభ్యులను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్,వార్డు సభ్యులు దశరథం, వెంకటేష్, పంతు,శారద,నాయకులు జె.హర్యా, కర్ణా, పంతు, శంకర్ పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య వ్యవస్థలో 'హిట్లర్' స్ఫూర్తి ఏంటి?

## ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై సి.పి.ఐ.(ఎం) తీవ్రఖండన

**ముషీరాబాద్, జూన్ 09 (జనం సాక్షి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న 'హైడ్రా' గూర్చి మాట్లాడుతున్న క్రమంలో, జర్మనీ నియంత హిట్లర్ తో పోల్చుతూ మాట్లాడడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి మాటలు ఖండిస్తున్నట్లుగా సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రకటన విడుదల చేశారు. ప్రజా వ్యతిరేకి, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసిన నియంతను స్ఫూర్తిగా తీసుకుని వ్యవహరిస్తానంటే... గతంలో హిట్లర్‌కు పట్టిన గతే పడుతుందని సి.పి.ఐ.(ఎం) హెచ్చరిస్తోందన్నారు. హిట్లర్ ప్రపంచ చరిత్రలోనే అత్యంత హీనమైన, దుర్మార్గపు చరిత్ర కలిగిన వ్యక్తనీ, లక్షలాది మందిని మానవత్వం లేకుండా, క్రూర మృగం కంటే దారుణంగా హత్యాకాండకు గురిచేసిన నరహంతకుడనీ, సుమారు 5 కోట్ల మంది ప్రజల ప్రాణాలను బలిగొని, కోట్లాది మంది జీవితాల్లో తీవ్ర విధ్వంసాన్ని నింపి రెండవ ప్రపంచ యుద్ధానికి మూల కారకుడు హిట్లర్ అని అన్నారు. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలను, ఇక్కడి హైడ్రా కూల్చివేతలను పోల్చి మాట్లాడటం ముఖ్యమంత్రికి అంతర్జాతీయ విషయాలపై అవగాహన లోపాన్ని సూచిస్తోందని చెప్పారు. ప్రజల హక్కులను కాలరాస్తూ, అహంకారంతో వ్యవహరించిన ప్రభుత్వాలకు, వ్యక్తులకు ప్రజలు ఎలా బుద్ధి చెప్పారో ప్రపంచ చరిత్రతో పాటు, మన దేశ, రాష్ట్ర చరిత్రలు కూడా నిరూపించాయనీ అన్నారు. ఒక ప్రజాస్వామ్య దేశంలో ప్రజల చేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి, హిట్లర్ పేరు ప్రస్తావిస్తూ, హైడ్రా పేరునే హిట్లర్ స్ఫూర్తితో తీసుకున్నానని అనడం అత్యంత విచారకరం, సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమైనవనీ, బాధ్యతారహితమైన వ్యాఖ్యలకు గాను రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సి.పి.ఐ.(ఎం) డిమాండ్ చేస్తోందన్నారు. ఇలాంటి వైఖరిని ఇలాగే కొనసాగిస్తే ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# నూతన డీఆర్‌ఓను మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గం



**ఇబ్రహీంపట్నం, జూన్ 9 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా రెవెన్యూ అధికారి అనంత రెడ్డి ని తెలంగాణ నాన్–గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన భేటీలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఊటు యశ్వంత్, జిల్లా కార్యదర్శి మెంఘ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డీఆర్‌ఓను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలోనూ, జిల్లా అభివృద్ధిలోనూ అధికారులకు టీఎన్జీవో సంఘం ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆనంద్ సింగ్, గోపాల్ నాయక్, సాయితేజ,తిరుపతి, వెంకటేష్, శ్రావణి, సుమలత, స్వప్న పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభ విజయం పట్ల ఎమ్మెల్యే అరికపూడి కృతజ్ఞతలు



**శేరిలింగంపల్లి, జూన్ 09 (జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభకు అశేష జనవాహిని హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడం పట్ల శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హర్షం వ్యక్తం చేస్తూ శేర్లింగంపల్లి ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం కృతజ్ఞతా సమావేశాన్ని ఏర్పాటు చేసి శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన ఆయా డివిజన్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల అసోసియేషన్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలకు, మహిళా నాయకురాళ్లకు, అధికారులు, అనధికారులకు అరికపూడి ఓవైపు హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తూ కృతజ్ఞతలు చెల్లించారు. అనంతరం మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజక వర్గం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న అంకితభావానికి, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభివృద్ధి విషయంలో చూపిస్తున్న ప్రత్యేక చొరవకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గ పరిధిలో దాదాపు 2 వేల కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన గావించడంతోపాటు అన్ని విధాలా సహకారం అందిస్తాను, ఆరు నెలలలో పూర్తి చేయండి అని రాష్ట్ర ముఖ్యమంత్రి సూచన చేయటం హర్షణీయమన్నారు. మియాపూర్ చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మాణం, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తదితర అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయటం తమ అదృష్టమని అరికపూడి అభివర్ణించారు. ముఖ్యమంత్రి బాటలోనే తాను కూడా నడుస్తానని రానున్న 24 నెలలు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని, వీలైనంత నిధులను నియోజకవర్గానికి రాబట్టడం ద్వారా అభివృద్ధి పథంలో అగ్రగామిగా నియోజకవర్గాన్ని నిలబెడతానని ఆయన భరోసాను వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంటి ప్రజా పక్షపాతి ప్రస్తుత కాలంలో లేరని, అలాంటి గొప్ప నాయకుడికి రానున్న సార్వత్రిక ఎన్నికలలో తిరిగి అధికార పీఠం అప్పగించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అత్తాపూర్‌లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్

## బంగారు వెండి ఆభరణాలు స్వాధీనం





**రాజేంద్రనగర్, జూన్9(జనంసాక్షి) :** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తేజస్విని నగర్‌లో జరిగిన ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించి నిందితుడైన రిషబ్ శుక్లా (21)ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలు సహా ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ టి. శ్రీనివాస్ పర్యవేక్షణలో అత్తాపూర్ పోలీసులు కేసును దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో జూన్ 9న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతడు అత్తాపూర్, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధుల్లో జరిగిన మరికొన్ని ఆస్తి నేరాల్లో కూడా పాల్గొన్నట్లు అంగీకరించాడు. విచారణలో భాగంగా, గత నెల 27న హైదర్‌గూడలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీలో జరిగిన ఇంటి దొంగతనం కేసులో తానే నిందితుడినని వెల్లడించాడు. అనంతరం మే 28న అత్తాపూర్‌లోని తేజస్విని నగర్‌లో జరిగిన మరో చోరీ కేసులోనూ తన ప్రమేయం ఉన్నట్లు ఒప్పుకున్నాడు. అలాగే మే 31న హైదర్‌గూడలోని నందనవనం అపార్ట్‌మెంట్‌లో జరిగిన దొంగతన యత్నం కేసులో కూడా పాల్గొన్నట్లు అంగీకరించాడు. నేరాలకు పాల్పడే ముందు నిందితుడు బాలెనో కారును అద్దెకు తీసుకుని వివిధ ప్రాంతాలకు వెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. నేరాల అనంతరం దొంగిలించిన బంగారు గొలుసు, కంకణాలు, లాకెట్, ఉంగరాలు, వెండి బిస్కెట్లు, వెండి గ్లాసు, పళ్లాలు, గిన్నెలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తిలో సుమారు 44 గ్రాముల బంగారు ఆభరణాలు, 460 గ్రాముల వరకు వెండి వస్తువులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.అత్తాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె. నాగేశ్వరరావు నేతృత్వంలోని పోలీసు బృందం నిందితుడిని అరెస్టు చేయగా కోర్టు ఆదేశాల మేరకు నిందితుడికి రిమాండ్ విధించింది.

# ఖానాపూర్‌లో ఘనంగా శతచండీ యాగం

## ముఖ్య అతిథిగా హాజరైన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి జూన్ 09 (జనంసాక్షి) :** ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో మెలగాలని భక్తి భావంతోనే ముక్తి లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో వెలిసిన శ్రీ హనుమాన్ దేవాలయంలో గత మూడు రోజుల నుండి పేద పండితులు శ్యాంసుందర్ శర్మ తో పాటు మరికొందరు వేద పండితుల ఆధ్వర్యంలో శత చండీ మహాయాగం ఘనంగా నిర్వహించారు.మహాయాగంలో భాగంగా తొలి రోజు గురువందనం,సంతాన పాశుపత పూజ,సుమంగళి మహిళల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.మంగళవారం లోక కళ్యాణం కోసం జరిపిన శతచండి మహాయాగం చివరి రోజున వైభవోపేతంగా వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.యాగ కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నా యని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆశీర్వాదాలు పొందడం శుభప్రదమైన విషయమని వారు అన్నారు.ప్రజలందరూ భక్తి భావంతో మెలగాలని భక్తి భావంతోనే ముక్తి లభిస్తుందని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్,మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకురు ప్రభాకర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ,డిసిసి నాయకులు శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కసిరెడ్డి వెంకట్ రెడ్డి,ఖానాపూర్ గ్రామ పెద్దలు, నాయకులు,యువకులు హనుమాన్ దేవాలయ భక్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పేద ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుంది

**- ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**హయత్‌నగర్, జూన్ 9 (జనంసాక్షి):** ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్త పేట డివిజన్ రాజీవ్ గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న శివకుమార్ (33 సంవత్సరాలు) కిడ్నీలకు సంబంధిత పలు ఆరోగ్య సమస్యలతో బాధపడు తూ, కుటుంబ ఆర్థిక పరిస్థితి సహక రించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి ని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి వారి వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా దరఖాస్తు చేయించారు. దీనికి రెండు లక్షల రూపాయల ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు కాగా బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా మాకు ఎంతో సంతృప్తి లభిస్తుంది. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతోమంది పేద ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కింది" అని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మా కుమారుడి ఆరోగ్య సమస్య విషయంలో సుదీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందని, ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, దీప్ లాల్, ఇటికల యాదగిరి, మహ్మద్ యాసిన్, జోగు నాగేష్, బట్టు అంజయ్య, సూర్యకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## వీరన్నపేట్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు బోరుమోటర్ అందజేత

**- దాతలైన సర్పంచులపై ఏఈ నరసింహులు హర్షం**



**జిల్లేడు చౌదరి గూడ (జనంసాక్షి) :** జిల్లేడు చౌదరిగూడ మండల పరిధి వీరన్న పేటలో గల 33/11 కేవి సబ్ స్టేషన్ నందు బోరు మోటార్ లేకపోవడంవలన విద్యుత్ ఎర్తులకు నీరు పోయడానికి ఇబందిగా ఉండటంతో గుర్తించి విద్యుత్ ఏఈ నరసింహులు అడిగిన వెంటనే బోరు మోటర్ ను సర్పంచ్ లందరు కూడి సమకూర్చారు. మంగళవారం కొత్త మోటర్ ను జంక్షన్ లో ఏఈ సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ జంక్షన్లో గత కొన్ని రోజులుగా నీటి సమస్య ఉండడంతో జంక్షన్ పరిధిలోకి వచ్చే వివిధ గ్రామాల సర్పంచ్ల దృష్టికి తీసుకు వెళ్లిన వెంబడి స్పందించి కొత్త మోటర్ ను అందజేశారు. జంక్షన్ ఎర్త్ లకు నీరు పోయడానికి ఇబ్బందిగా ఉండడంతో వారినుంచి ఉచితంగా మోటర్ ను పొందినట్లు తెలిపారు. బోరు మోటర్ ఉచితంగా అందించడానికి సహకరించిన సర్పంచ్ లు ధర్మ్యా తండా చందు నాయక్, వాచ్చ తండా రవి నాయక్, ముష్టిపల్లి జంగయ్య, చెగిరెడ్డి ఘనపూర్ పావని శివమౌళి, చింతకుంట తండా దేవి రామ్ చరణ్, పెద్ద ఎల్కిచర్ల సోనీ శేఖర్, వీరన్న పేట సుమలత వెంకట్ రాములు, గాలి గూడెం స్వప్న సత్యం లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## మైలార్దేవ్‌పల్లి యూపీహెచ్‌సీలో సదుపాయాల లేమిపై వెంకటేష్ ఆందోళన



**రాజేంద్రనగర్, జూన్9 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ డివిజన్ పరిధిలో నిర్వ హిస్తున్న "బస్తీబాట" కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు మైలార్దేవ్ పల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ సందర్శనలో దవాఖానలోని మౌలిక వసతులు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత లోపించిందని, విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో మండుటెండల్లో వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరైన వెలుతురు, ఫ్యాన్లు లేక ఉక్కపోత వాతావరణంలో రోగులతో పాటు సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులను కోరారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులకు మంచినీరు, పండ్లు పంపిణీ చేసి పరామర్శించారు. ఈ కార్య క్రమంలో రమేష్ ముదిరాజ్, రాముయాదవ్, రాఘవేందర్ యాదవ్, రాజేష్ యాదవ్, మైసిరెడ్డి, అరుణ రెడ్డి, సరిత, మహేష్, కొంపల్లి జగదీష్, అశోక్ కుమార్, ప్రవీణ్, వెంకటరమణ, యాదగిరి, భాస్కర్, అనిల్, నాని, చారి, రవి, రిషి తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వినూత్న రీతిలో బడిబాట కార్యక్రమం

**- కారునే ప్రచార రథంగా మార్చి ర్యాలీ**



**బొంరాస్ పేట, జూన్ 9 (జనంసాక్షి):** మండల పరిధిలోని ఏర్పుమళ్ళ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.వెంకట్ రెడ్డి మంగళవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమం వినూత్న రీతిలో జరిగింది.తన సొంత కారునే ప్రచార రథంగా మార్చి గ్రామ వీధుల లో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఐదు ప్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూరు కాగా మన గ్రామానికి ప్రీ ప్రైమరీ పాఠశాల రావడం అదృష్టం అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఉత్తమమైన బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులు కేవలం ప్రభుత్వ పాఠశాలలోనే ఉంటారన్నారు. మీ పిల్లల బంగారు భవిష్యత్తు బాగుండాలంటే ప్రభుత్వ పాఠశాలకే పంపాలని ప్రవేటు బడుల వ్యామోహంలో పడవద్దన్నారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ బందెయ్య,ఉప సర్పంచ్ తిరుపతయ్య, ఉపాధ్యా యులు ప్రశాంత్ ,సర్దార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితులకు ఆసరాగా సీఎం రిలీఫ్ ఫండ్

**- మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్**



**కుల్కచర్ల, జూన్ 9 (జనం సాక్షి):** అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా ఉంటుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని పలు గ్రామాలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం బాధితులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కొనియాడారు.

ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు భీమ్ రెడ్డి, కనకం మొగులయ్య, పార్టీ అధ్యక్షుడు గోపాల్, జోగు వెంక టయ్య గౌడ్, అంజిలయ్య గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి సదస్సుకు తరలివెళ్లిన కొడంగల్ మహిళలు



**కొడంగల్, జూన్ 09 (జనంసాక్షి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్వ హిస్తున్న ఇందిరా మహిళా శక్తి సదస్సులో పాల్గొనేందుకు కొడంగల్ మండలానికి చెందిన మహిళలను ప్రత్యేక బస్సుల్లో జెండా ఊపి ప్రారంభించారు.మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో పాల్గొన డానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో మహిళ లు బయలుదేరారు. కార్యక్రమంలో కొడంగల్ ఏపిఎం గోపాల్, మం డల సమాఖ్య అధ్యక్షురాలు అంజమ్మ, కార్యదర్శి మాసనమ్మ, కోశాధి కారి సత్యమ్మ,సీసీలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి సదస్సుకు తరలివెళ్లిన బొంరాస్ పేట మహిళలు




**బొంరాస్ పేట, జూన్ 9 (జనంసాక్షి):** సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్లో మంగళవారం ప్రభుత్వం తరఫున నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి సదస్సుకు మండల పరిధిలోని మహిళలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జెండాఊపి జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి బస్సు ను ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి హాజరైన సదస్సు లో మహిళలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు కవిత, ఏపిఎం బందెయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, స్థానిక సర్పంచ్ వీరేశలింగం, నాయకులు నరసింహ నాయుడు, సంతోష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## విశాల్ పెరిఫెరల్స్ భాగస్వామ్యంతో భారత మార్కెట్లోకి ఫనాటెక్

**- సిమ్ రేసింగ్‌ను ప్రారంభించిన సినీనటి చాందిని భగ్వనాని**

**- ప్రీమియం సిమ్ రేసింగ్ అనుభూతిని భారతీయ గేమర్లకు అందించే లక్ష్యం**

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ప్రపంచ వ్యాప్తంగా ప్రీమియం సిమ్ రేసింగ్ హార్డ్‌వేర్,డ్రైవింగ్ సిమ్యులేషన్ టెక్నాలజీలో అగ్రగామిగా పేరొందిన ఫనాటెక్ భారత మార్కెట్లోకి అధికారికంగా అడుగుపెట్టింది. దేశంలోని ప్రముఖ ఐటీ, గేమింగ్ రిటైల్ సంస్థతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుని భారతీయ గేమింగ్ రంగంలో తన కార్య కలాపాలను ప్రారంభించింది. సికింద్రాబాద్‌లో నిర్వహించిన గ్రాండ్ లాంచ్ కార్యక్రమంలో ప్రముఖ నటి చాందిని భగ్వనాని పాల్గొని ఫనా టెక్ సిమ్ రేసింగ్ ఉత్పత్తులు, అత్యాధునిక డ్రైవింగ్ సిమ్యులేషన్ సాంకేతికతను ఆవిష్కరించారు. ఈ భాగస్వామ్యం ద్వారా భారతీయ గేమర్లు, ఈ-స్పోర్ట్స్ క్రీడాకారులు, రేసింగ్ ప్రొఫెషనల్స్, కంటెంట్ క్రియేటర్లకు ప్రపంచస్థాయి సిమ్ రేసింగ్ అనుభూతిని అందించ నున్నట్లు సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. విశాల్ పెరిఫెరల్స్‌కు ఉన్న విస్తృత రిటైల్ నెట్‌వర్క్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలు, గేమింగ్ కమ్యూ నిటీ ద్వారా ఫనాటెక్ ఉత్పత్తులు దేశవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నాయి. భారతీయ వినియోగదారులు ఇకపై ఫనాటెక్ అసలైన ఉత్పత్తులను నేరుగా విశాల్ పెరిఫెరల్స్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా కొనుగోలు చేయడంతో పాటు అధికారిక వారంటీ, అమ్మకాల అనంతర సేవలను పొందవచ్చు. మెట్రోనగరాలతో పాటు అభివృద్ధి



చెందుతున్న గేమింగ్ మార్కెట్లలో కూడా సిమ్ రేసింగ్ టెక్నాలజీపై అవ గాహన పెంచడంపై ప్రత్యేకదృష్టి సారించనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విశాల్ పెరిఫెరల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వికాస్ హిసారియా మాట్లాడుతూ... భారతీయ వినియోగ దారులకు ప్రపంచ ప్రఖ్యాత సిమ్ రేసింగ్ టెక్నాలజీని అందించడం సంతోషంగా ఉందన్నారు. గేమింగ్, ఈ-స్పోర్ట్స్ రంగాల్లో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అత్యాధునిక ఉత్పత్తులను అందించేందుకు సంస్థ కట్టు బడి ఉందని తెలిపారు. గేమింగ్ క్రియేటర్లు, స్ట్రీమర్లు, ఇన్‌ఫ్లూయెన్స ర్లతో కలిసి సిమ్ రేసింగ్ సంస్కృతిని ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్ట నున్నారు. డిజిటల్, సోషల్ మీడియా ప్రచారాల ద్వారా నూతనతరం గేమింగ్ అనుభూతులను మరింత విస్తృతంగా పరిచయం చేయనున్న ట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య నేనుంటా

**- కాలనీల సమస్యల పరిష్కారమే నా ధ్యేయం**
**- మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**

**హయత్‌నగర్, జూన్ 9 (జనంసాక్షి):** మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని మార్నింగ్ వాక్‌లో భాగంగా వివిధ కాలనీలలో కాలనీ సంక్షేమ సంఘ సభ్యుల ఆహ్వానం మేరకు వారితో కలిసి పర్యటించి, కాలనీలలో ఉన్న సమస్యలను మాజీ జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అడిగి తెలుసుకున్నారు. వారు వినాయక్ నగర్ కాలనీ హనుమాన్ మార్గ నుండి బొమ్మల గుడి రోడ్డు, సిరి హిల్స్ కాలనీ నుండి శివ గంగా కాలనీకి కనెక్టింగ్ చేస్తున్న నూతన సీ.సీ రోడ్డు పనుల పర్యవేక్షణ, వినాయక నగర్ కాలనీ రోడ్డు నెం - 17 లో ఉన్న సమస్య, వివిధ కాలనీలో స్వయంగా కాలనీ సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి పర్యటించారు.

ఈ సందర్భంగా నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ వినాయక్ నగర్ కాలనీ, హనుమాన్ మార్గ రోడ్డు నుండి రాజరాజేశ్వరి కాలనీ రోడ్ నెం - 1 నుండి బొమ్మల గుడి చౌరస్తా వరకు అటాచ్ రోడ్డు వారం రోజుల్లో పూర్తయి అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. కొంతవరకు ఆలస్యమైనా అద్భుతమైన రోడ్డును అన్ని రోడ్లకు అనుసంధానంగా, లెవెల్స్ సమకూర్చి వర్షపు నీరు నిలవకుండా, మళ్ళీ సమస్యల తలెత్తకుండా, నూతన రోడ్లను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. సిరిహిల్స్ కాలనీ నుండి శివగంగా కాలనీ అటాచ్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి మరో వారం రోజుల్లో పూర్తయి ఆ రోడ్డును కూడా అందుబాటులోకి తీసుకు రావాలని, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అద్భుతమైన కనెక్టివిటీ రోడ్డు నిర్మించాలని కాంట్రాక్టర్‌కు తెలియజేసి, కొద్దిగా ఆలస్యమైనా సహకరించినందుకు కాలనీవాసులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



వినాయక్ నగర్ కాలనీ రోడ్ నెంబర్. 17 లో చిన్న వర్షం పడిన, ఆర్టీసీ ఎక్స్టెన్షన్ కాలనీ కనెక్టివిటీ రోడ్డు కొద్ది సమస్య ఉండడంతో నీటి నిలువ ఉండడం వలన ఇబ్బంది అవుతుందని, సమస్యను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్‌ను పూర్తిచేసి తొందర్లోనే సమస్యను పరిష్కరించి, వర్షపు నీరు నిలవకుండా సిసి రోడ్డును నిర్మిస్తానని హామీ ఇచ్చారు. వివిధ కాలనీలలో చాలా రోజులుగా కొంత మేరకు ఆలస్యమై ప్రారంభించిన భూగర్భ డ్రైనేజీ, సి.సి రోడ్ల పనులకు సహకరించిన కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమం లో కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు బద్దం లక్ష్మణ్, యం రమేష్, రాజి రెడ్డి, వెంకన్న, రాజేశ్వరి, భాస్కర్, జంగయ్య యాదవ్, సురేందర్, బాల్ రెడ్డి, వి సత్యనారాయణ, దిగ్విజయ్, బీజేపీ నాయకులు నక్క రాజేష్ గౌడ్, టీ.శ్యాంసుందర్ రెడ్డి, వెంకటరమణ గౌడ్, మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల ముప్పు మధ్య రైతులకు భరోసా

**- కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఏనుగు సుదర్శన్ రెడ్డి**

**ఘట్‌కేసర్, జూన్ 9 (జనంసాక్షి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్‌లోని ఎదులాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం పరిస్థితిని పరిశీలించి రైతులతో మాట్లాడారు.

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి బస్తాల్లో నింపి సిద్ధంగా ఉంచినప్పటికీ, రవాణా సౌకర్యాల కొరత కారణంగా దాదాపు పది రోజులుగా అక్కడే నిల్వ ఉండిపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని వారు తెలిపారు.

రైతుల సమస్యలను విన్న సుదర్శన్ రెడ్డి, సివిల్ సప్లైస్ మరియు వ్యవసాయశాఖ అధికారులతో నేరుగా మాట్లాడి పరిస్థితిని వివరించారు. రైతులు ఏడాది పొడవునా శ్రమించి పండించిన పంటకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తక్షణచర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రవాణా సమస్యలను వెంటనే పరిష్కరించి ధాన్యాన్ని గోదాములకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. దీనిపై స్పందించిన సివిల్ సప్లైస్, వ్యవసాయశాఖ అధికారులు ప్రస్తుతం ఉన్న రవాణా ఇబ్బందులను అధిగమించి కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని వచ్చే రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో తరలించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మాయ నరేష్, బూత్ అధ్యక్షుడు ఎర్రోళ్ల మురళి, స్థానిక రైతులు, బీజేపీ నాయకులు, సివిల్ సప్లైస్ మరియు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ఏనుగు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.



# మున్సిపల్ కార్మికుల వేతనాలను పెంచాలి

**- పాలడుగు భాస్కర్, జే వెంకటేష్**

**హయత్‌నగర్, జూన్ 9 (జనంసాక్షి):** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఆఫీస్ ముందు సీఐటీయు రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎంసి కార్మికుల కనీస వేతనం 26000 వేలు చెల్లించాలని, సూపర్వైజర్లకు 30 వేల వేతనం ఇవ్వాలని, రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, అధికారుల వేతనాలు పెరిగినప్పటికి, కార్మికుల వేతనాలు మాత్రం అనేక సంవత్సరాలుగా పెరగటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు పెంచాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద పదిలక్షల రూపాయలు చెల్లించాలని, వారాంతపు సెలవు దినాలు వర్తింపచేయాలని, మరణించిన కార్మికుల దహన సంస్కారాలకు 30 వేల రూపాయలు చెల్లించాలని, 60సంవత్సరాలు పైబడిన కార్మికులను తొలగిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, మున్సిపల్ కార్మికులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానంలో మార్పులు చేయాలని, పట్టణ విస్తరణకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు హయత్‌నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య, జిహెచ్ఎంసి యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, మేడ్చల్ జిల్లా నాయకులు శ్రీనివాస్, నర్సింగరావు, గణేష్, మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించండి

**- వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్**



**కుల్కచర్ల, జూన్ 9(జనంసాక్షి):** మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో రానున్న వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బందికి సీసనల్ వ్యాధులపై మంగళవారం సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కిరణ్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలయ్యే అవకాశం ఉన్నందున వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి అవగాహన కల్పించా లన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో వైద్య సిబ్బంది డాక్టర్ మాధురి, అరుణ, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుపై మహిళా కాంగ్రెస్ నిరసన



**అల్వాల్, జూన్ 9 (జనంసాక్షి):** దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా తెలంగాణప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఆధ్వ ర్యంలో మంగళవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ళ లక్ష్మి పిలుపు మేరకు.. అల్వాల్ ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు వీనస్ మేరీ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నుండి మహిళా కాంగ్రెస్ శ్రేణులు ఈ నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పెరిగిన ధరలపై మహిళా నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో సామాన్యుడి బతుకు భారంగా మారిందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు తక్షణమే స్పందించి పన్నులను తగ్గించి, ధరలను అదుపుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు లక్ష్మి, సరోజ, శకుంతల నాయుడు, నిర్మల, భాగ్యలక్ష్మి, సుకన్య, గాయత్రి, విజయలక్ష్మి, శశికళ, అరుణ పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన కార్యదర్శికి ఆత్మీయ వీడుకోలు



**బొంరాస్ పేట, జూన్ 9 (జనంసాక్షి):** మండల పరిధిలోని టేకుల గడ్డ తండాకు చెందిన పంచాయతీ కార్యదర్శి ఎం. శ్రీనివాస్ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా దోమ మండలం కొం డయి పల్లి గ్రామానికి బదిలీపై వెళ్లారు. గ్రామానికి పూడూరు మండలం పుడుకుర్తి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాస్ బదిలీపై ఇక్కడికి రావడం జరిగింది.మంగళవారం స్థానిక సర్పంచి లక్ష్మీరాజు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీపై వెళ్లిన కార్యదర్శి గ్రామానికి చేసిన సేవలను గుర్తుచేసుకొని శాలువా పూలమాలతో ఆయనను ఘనంగా సన్మానించారు. నూతన కార్యదర్శిగా బదిలీపై వచ్చిన శ్రీనివాసులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేతావత్ రాములు, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఆఫర్లతో నట్టేట మునగొద్దు

- నిరుద్యోగ యువకులారా జాగ్రత్త
- టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి



**ముషీరాబాద్, జూన్ 09 (జనంసాక్షి):** ఆర్టీసీ ఉద్యోగాల పేరిట మోసగాళ్ల చేతిలో చిక్కి మోసపోవద్దనీ, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసే మధ్యవర్తులను, దళారులను అస్సలు నమ్మవద్దని టీజీఎస్ ఆర్టిసి ఎండి నాగిరెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. టీజీఎస్ ఆర్టీసీలో ఉద్యోగ నియమ కాలన్నీ పూర్తి పారదర్శకంగా, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో మాత్రమే జరుగుతాయనీ తెలిపారు. అడ్డదారులు తొక్కి జీవితాలను పాడుచేసుకోవద్దనీ, కష్టపడి చదివి, ప్రతిభే పెట్టుబడిగా, ఆ ప్రతిభతోనే ఆర్టీసీ కొలువులు సాధించాలని చెప్పారు. కొలువుల పేరుతో అమాయక నిరుద్యోగులను మోసం చేసే వారిపై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తప్పవనీ హెచ్చరించారు.

# బీరప్పగడ్డలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు



**ఉప్పల్, జూన్ 9 (జనంసాక్షి):** బీరప్పగడ్డ డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్థానిక నాయకుడు రాచకొండ శివకుమార్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పారిశుధ్య శాఖ అధి కారులు వెంటనే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుధ్య శాఖ డీఈ నీలిమ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను విధులకు హాజరయ్యేలా చేసి, పరిశుభ్రత పనులను పూర్తి చేయించారు. ప్రజా సమ స్యల పరిష్కారానికి అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ పనిచేస్తున్నట్లు రాచకొండ శివ కుమార్ తెలిపారు. బీరప్పగడ్డ డివిజన్ అభివృద్ధి, పరిశుభ్రత, ప్రజా సంక్షేమం కోసం తన కృషి కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి

- తెలుగుదేశం పార్టీ తాండూర్ నియోజకవర్గ నాయకులు ఎర్ర హనుమంతు



**యాలాల జూన్ 9(జనంసాక్షి):** రైతులకు ప్రస్తుతం కావాల్సిన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు చూడాలని తెలుగుదేశం పార్టీ తాండూర్ నియోజకవర్గ నాయకులు ఎర్ర హనుమంతు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతుల నుండి వరి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని రైతులు ఒకవైపు ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. పండించిన వరి ధాన్యాన్ని నెల రోజుల వరకు తమ వద్దనే పెట్టుకొని అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.కొంతమంది రైతులు అయితే ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి తక్కువ ధరకే అమ్ముకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఆ విధంగా జరగకుండా ముందస్తుగా రైతులకు కావాల్సిన విత్తనాలు ఎరువులను అందుబాటులో ఉంచి రైతు భరోసా డబ్బులను కూడా ఇచ్చి రైతును ఆదుకోవాలని కోరారు.

# తాండూరు ప్రజలు గర్వించదగ్గ నాయకుడు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

- రాజకీయ నాయకుడు కాదు... రాజనీతిజ్ఞుడు - జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి, న్యాయవాది కే. గోపాల్

**తాండూరు జూన్ 9(జనంసాక్షి):** రాజకీయ నాయకులు సాధారణంగా వచ్చే ఐదు సంవత్సరాల ఎన్నికలు, ఓట్ల గురించి ఆలోచిస్తారు. కానీ రాజనీతిజ్ఞుడు మాత్రం భవిష్యత్ తరాల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి గురించి ఆలోచిస్తారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి, న్యాయవాది కే. గోపాల్ అన్నారు. మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల హయాంలో తాండూరు ప్రజల స్థలాలు, సహజ వనరులు ఎలా కబ్జాలకు, దోపిడీకి గురయ్యాయో ప్రజలందరికీ తెలిసిందే. అయితే మనోహర్ రెడ్డి నాయకత్వంలో ప్రజాఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యత లభిస్తోంది. తాండూరు పట్టణానికి మణిహారంగా విరాజిల్లుతున్న విలియం మూన్ పాఠశాల స్థలం పట్టణ ప్రజలకు ఎంతో విలువైన ఆస్తి. ఈ ప్రదేశం పర్యావరణ పరిరక్షణకు, ఉదయం వాకింగ్‌కు వచ్చే వందలాది మందికి ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని అందిస్తోంది. ఈ స్థలం కబ్జాకు గురికాకుండా రక్షించేందుకు మనోహర్ రెడ్డి తీసుకున్న చర్యలు అభినందనీయం. ప్రహరీ గోడ నిర్మాణం కోసం తొలి విడతగా రూ.25 లక్షలు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టడం ప్రజలందరికీ గర్వకారణం. గతంలో పీపుల్స్ కళాశాల స్థలం, సెయింట్ మార్ఫ్స్ స్థలం వంటి ప్రజా ఆస్తులు ఎలా కబ్జాలకు గురయ్యాయో తాండూరు ప్రజలు, మేధావులు గమనించారు.అయితే మనోహర్ రెడ్డి చర్యలు వాటికి పూర్తి భిన్నంగా ఉన్నాయి. భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజా ఆస్తుల సంరక్షణకు కట్టుబడి ఉన్నారని గర్వంగా చెప్పుకోవచ్చు. అంతేకాకుండా తాండూరు పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు కాగ్నా నుంచి నీటి తరలింపు ప్రాజెక్టుకు రూ.18 కోట్ల నిధులు మంజూరై వేగంగా పనులు కొనసాగుతున్నాయి.భవిష్యత్తులో తాండూరు పట్టణానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వ అనుమతుల కోసం కృషి చేస్తున్న నాయకుడు కూడా మన మనోహర్ అన్నే. ఇదే కాకుండా, గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన కోటిపల్లి, జుంటుపల్లి మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పునరుద్ధరణ కోసం



నడుం బిగించి, సుమారు రూ.100 కోట్లతో కోటిపల్లి ప్రాజెక్టు కాలువల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేసిన ఘనత కూడా మనోహర్ అన్నకే చెందుతుంది. దీనిద్వారా ఆయకట్టు విస్తీర్ణాన్ని సుమారు 10,000 ఎకరాలకు పెంచి రైతులకు మేలు చేసిన నాయకుడిగా నిలిచారు.

మనోహర్ అన్నా... నిన్ను చూసి తాండూరు ప్రజలు గర్విస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇలాంటి అభివృద్ధి దృక్పథం కలిగిన నాయకుడి కోసం ఎదురుచూస్తున్న ప్రజల ఆకాంక్ష నేడు నెరవేరింది.

# ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పి.మహేందర్ రెడ్డికి ఆహ్వానం

- 21న వీరశైవసమాజ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



తాండూరు జూన్ 9(జనంసాక్షి)వీరశైవ సమాజ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల 21వ తేదీన ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విఫ్ డాక్టర్ పి. మహేందర్ రెడ్డిని కార్యవర్గ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. సమాజ సేవలో కార్యవర్గం మరింత చురుకుగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి సమాజ గౌరవ అధ్యక్షులు, పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం అధ్యక్ష కార్యదర్శులు ,కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# అమృత కాలనీ అభివృద్ధికి భారీ నిధులు

- రూ. 1 కోటి 5 లక్షలతో సిమెంట్ రహదారుల నిర్మాణం
- నిధులు మంజూరు చేయించిన మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, జూన్ 9 (జనంసాక్షి):** శివారు ప్రాంతాల అభివృద్ధికి కూడా ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి మహానగర పరిధిలోని ఇతర కాలనీల మాదిరిగానే అమృత కాలనీని కూడా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఉప్పల్ విభాగ పరిధిలోని అమృత కాలనీలో ఉన్న సమస్యలను ఇటీవల కాలనీవాసులు మాజీ ప్రజాప్రతినిధి మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన రజిత పరమేశ్వర్ రెడ్డి గారు కాలనీలో సిమెంట్ రహదారుల నిర్మాణం కోసం రూ. 1 కోటి 5 లక్షల నిధులను మంజూరు చేయించారు. మంగళవారం కాలనీలో జరుగుతున్న సిమెంట్ రహదారుల నిర్మాణ పనులను రజిత పరమేశ్వర్ రెడ్డి గారు పరిశీలించి, పనుల నాణ్యతపై అధికారులకు సూచనలు చేశారు. కాలనీలో ఉన్న ఇతర సమస్యల పరిష్కారానికి కూడా అవసరమైన నిధులను మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఎర్ర ఐలేష్ యాదవ్, కాలనీ ప్రధాన



కార్యదర్శి పసునూరి బిక్షపతి, పద్మ బిక్షపతి, సల్లా ప్రభాకర్ రెడ్డి, కాలనీ ఖజానాదారు రంగయ్య, సావిత్రి రంగయ్య, రాజశేఖర్, గౌరవ సభ్యులు నరసింహారెడ్డి, సురేంద్రబాబు, మహేందర్, రమేష్, లోకేష్, భాను ప్రసాద్, ఫిలిప్స్, నాగరాజు, కొట్టె శ్రీనివాస్, రఘు మోహన్ రెడ్డి, ఎల్.ఎన్. రెడ్డి, నాగేశ్వరరావు, కుమారస్వామి, మక్బూల్, సుభాష్, కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేష్, శ్రీనివాస్, ఐ.ఎన్. రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సమైక్యకు బస్సు పంపిణీ

**మోమిన్‌పేట, జూన్ 9( జనం సాక్షి) :** మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణకు తోడ్పాటుగా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మోమిన్‌పేట మహిళా సమైక్యకు మంగళవారం బస్సును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి, తాసిల్దార్ రవీందర్. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ యాదవ్, పాల్గొని బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళా సమైక్యకు అందజేసిన బస్సు ద్వారా సంఘ సభ్యుల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వివిధ శిక్షణా కార్యక్రమాలు, సమావేశాలకు హాజరుకావడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మధుకర్, వికారాబాద్ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కోస్గి సురేందర్, నాయకులు ఎజాస్ పటేల్,మహిళా సమైక్య సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నేడు రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలి

### జిల్లా సీపీఐ కౌన్సిల్ సభ్యుడు ఎండి.మక్బూల్

**చేవెళ్ల, జూన్ 09 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా సీపీఐ కౌన్సిల్ సభ్యుడు ఎండి. మక్బూల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రోజు రోజుకు ధరలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజల రక్తం పీల్చుతుందన్నారు. కేంద్రం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు, నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదిన రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు భారీ ధర్నా నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈ ధర్నాకు జిల్లా నలుమూలాల నుంచి అన్ని ప్రజా సంఘాలు, ప్రజలు, పార్టీ నాయకులు, అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

## చట్టం ముందు అందరూ సమానమే..

### ఎస్సై వసంత్ జాదవ్



**దోమ జూన్, 09 (జనంసాక్షి) :** పోలిసుల పట్ల దురుసుగా ప్రవర్తించే ఎంతటివారినైన వదిలే ప్రసక్తే లేదని దోమ ఎస్సై వసంత్ జాదవ్ హెచ్చరించారు. కుల్కచర్ల మండలంలోని అంతారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తుల్జానాయక్ కోస్గి పట్టణం నుంచి దోమ మండలంలోని దాదాపూర్ మీదుగా కుల్కచర్ల వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు దాదాపూర్ సమీపంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా, అతను పోలిసులకు చిక్కాడు. పోలిసులు అతనికి డ్రంక్ డ్రైవ్ టేస్ట్ నిర్వహించేందుకు వెళ్లినప్పటికి అతను నిరాకరించాడు. తాను మాజీ సర్పంచి, తననే ఉదమంటావా అని దురుసుగా మాట్లాడాడని కానిస్టేబుల్ తెలిపారు. ఈ విషయం ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లడంతో ఎస్ఐ ఘటన స్థలికి చేరుకొని అతనికి డ్రంక్ అండ్ డ్రైవ్ టేస్టు చేశారు. ఇందులో అతనికి 67 పాయింట్లు మద్యం సేవించినట్లు గుర్తించగా ఈ మేరకు కేసు నమోదు చేశాడు. మద్యం సేవించడమే కాకుండా పోలిసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన మాజీ సర్పంచ్ తుల్జానాయక్ ను రిమాండ్కు తరలించినట్లు దోమ ఎస్సై వసంత్ జాదవ్ తెలిపారు.

## భూ కబ్జాకు ఎక్కడైనా పాల్పడితే భూమిని స్వాధీన పరచుకోండి

### మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్



**నిజాంపేట్, జూన్ 9 (జనంసాక్షి) :** రాజకీయంగా ఓర్వలేక కొందరు తప్పుడు ఆరోపణలతో వ్యక్తిత్వం పై కొందరు బురద జల్లే కార్యక్రమం పరిపాటిగా మారిందని, తాను, మా కుటుంబ సభ్యులు ఎవరైనా దుండిగల్ మండల పరిధి లో ఎక్కడైనా భూకబ్జాలకు పాల్పడినట్లయితే తాసిల్దార్ స్వయంగా అట్టి భూమి వెంటనే స్వాధీనం పరచుకోవచ్చని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తాసిల్దార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నాపై ఒక పత్రికలో వచ్చిన తప్పుడు ఆరోపణల దృష్ట్యా తన జీవితంపై కావాలని తప్పుడు ఆరోపణలతో పాల్పడుతున్నందున తానే స్వయంగా అటువంటి వారికి నిజం తెలిసే విధంగా తెలియజేయాలనే అనే ఉద్దేశంతో నిజ నిర్ధారణ కోసం ఈ వినతి పత్రం ద్వారా తహసిల్దార్ కు తెలియజేస్తున్నానని తెలిపారు. దీనిపై స్పందించిన తహసిల్దార్ త్వరలో సర్వే నిర్వహించి కబ్జాలకు పాల్పడిన ఎటువంటి భూమి ఉన్న విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు .



## మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బస్సుకు ఘన ప్రారంభోత్సవం

**మర్పల్లి జూన్ 09 (జనంసాక్షి) :** మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి పథకంలో భాగంగా మర్పల్లి మండల మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) ఆధ్వర్యంలో బస్సును మంగళవారం ఘనంగా ప్రారంభించారు. మహిళా శక్తి కార్యక్రమం కింద రాష్ట్రంలోని అన్ని మండల మహిళా సమాఖ్యలు కలిసి రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 బస్సులను కొనుగోలు చేసి టీజీఎస్ఆర్టీసీకి అద్దెకు అందించాయి. మహిళలు కేవలం రుణగ్రహీతలుగా కాకుండా ఆస్తుల యజమానులుగా ఎదిగే అవకాశాన్ని పొందారు. మహాలక్ష్మి పథకం విజయవంతమైన అమలుకు ఈ బస్సులు కీలకంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంలో ఈ పథకం దోహదపడుతోంది. ఇప్పటి వరకు సుమారు 308 కోట్ల మహిళా ప్రయాణీకులు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోగా, మహిళలు మొత్తం రూ.10,696 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రారంభించిన బస్సుల్లోనే హైదరాబాద్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశానికి ఉత్సాహంగా బయలుదేరారు. మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి, స్వేచ్ఛాయుత ప్రయాణానికి ఈ బస్సులు ప్రతీకలుగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, సర్వేశ్, ఏపీఎం సమ్మయ్యతో పాటు మహిళా సమాఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ బస్సులు కేవలం వాహనాలు కాదు.. తెలంగాణ మహిళల ఆర్థిక స్వావలంబనకు, స్వేచ్ఛా ప్రయాణానికి రథచక్రాలు" అని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి రుక్మాపూర్ సర్పంచ్ బాలరాజ్

### పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి

**పెద్దేముల్ జూన్ 09(జనంసాక్షి)** బిఆర్ఎస్ పార్టీకి చెందిన రుక్మాపూర్ గ్రామ సర్పంచ్ బాలరాజ్,అలాగే గ్రామ అవార్డు మెంబర్లు మంగళవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తాండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బుయ్యాని మనోహార్ రెడ్డి సమక్షంలో పార్టీ కండవ కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యత చూసి బాలరాజ్ పార్టీలో చేరినట్లు తెలిపారు. రుక్మాపూర్ గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన సర్పంచ్ బాలరాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాలకు నిధులు రావడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే గ్రామ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఎమ్మెల్యే మనోహార్ రెడ్డి నాయకత్వంలో గ్రామంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ధారాసింగ్



నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు శోభారాణి,కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి,పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మైపాల్ రెడ్డి మండల సీనియర్ నాయకులు నల్ల ఎల్లారెడ్డి, కొమ్ము గోపాల్ రెడ్డి, రాంగోపాల్ ,చంద్రయ్య, ఓమ్లు నాయక్ తండ సర్పంచ్ సుమిత్ర రాథోడ్,తదితరులు పాల్గొన్నారు.

## కౌకూర్ దళిత బస్తీల్లో తీరిన విద్యుత్ కష్టాలు

**అల్వాల్, జూన్ 9 (జనంసాక్షి):** యాప్రాల్ డివిజన్ కౌకూర్ పరిధిలోని ఇందిరా కాలనీలో ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న విద్యుత్ సమస్యలకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెల్ల మల్లికార్జున్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషితో మంగళవారం ఇక్కడ మూడు కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. మైనంపల్లి హనుమంతరావు మార్గదర్శకత్వంలో మల్లికార్జున్ ఈ పనులను దగ్గరుండి పూర్తి చేయించారు. అలాగే హరిజన్ బస్తీ, ఇందిరా కాలనీల్లో ఇళ్ల పైకప్పుల మీదుగా ప్రమాదకరంగా వెళ్తున్న ఓవర్‌హెడ్ విద్యుత్ తీగలను తొలగించి, నూతన లైన్లను పునఃస్థాపించారు. దళిత బస్తీల్లో భద్రత, మెరుగైన విద్యుత్





సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు మల్లికార్జున్ తెలిపారు. ప్రమాదకర తీగల నుంచి విముక్తి లభించడంతో బస్తీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివరాజ్, ఎల్లం, గౌతమ్, రాజ్‌కుమార్, నరేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## మోత్కూర్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట



**దోమ జూన్ 09 జనం సాక్షి :** వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలో ని మోత్కూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు కె. పాండు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. పాండు,మోత్కూర్ సర్పంచ్ కొత్తపేట ఆనంద్, చంద్రకాంత్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దండుమైలారంలో ముమ్మరంగా 'బడిబాట'

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: జీహెచ్ఎం వి.గోవర్ధన్




**ఇబ్రహీంపట్నం, జూన్ 9 (జనంసాక్షి) :** గ్రామంలోని బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వసతులను సద్వినియోగం చేసుకోవాలని దండుమైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు (+ఎవీ) వి. గోవర్ధన్ కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దండుమైలారం గ్రామంలో ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో 'బడిబాట' కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ గారు ఉపాధ్యాయ బృందం మరియు వార్డు సభ్యులతో కలిసి గ్రామంలోని పలు వార్డులు, కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు, గ్రామ పెద్దలకు, యువకులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న ఉచిత విద్య, ఉచిత ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉదయం పూట అల్పాహారం మరియు విద్యార్థుల కిట్లు వంటి పథకాలను వారు వివరించారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అనుభవజ్ఞులైన ప్రభుత్వ ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్య అందుతుందని, కావున గ్రామ ప్రజాప్రతినిధులు, యువకులు, తల్లిదండ్రులు చొరవ చూపి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు ప్రసాద్, చాంద్, పాషా, నిఖిల్, వెంకటేష్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు నివేదిత, సుజాత, శ్రీనివాస్, రామకృష్ణ, లింగమయ్య, వెంకటరమణ, పూజరి రమేశ్, సుమలత, రామేశ్వరి, విజయ, షఫీలతో పాటు పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్, వ్యక్తి మృతి

**తాండూరు జూన్ 9(జనంసాక్షి)** బైక్‌పై విధులకు వెళ్తున్న ఓ వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొనడంతో అతను మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాధా కిషన్ రావు తనటిఎస్ 07 ఈఎఫ్ 8131నంబర్ గల ద్విచక్ర వాహనంపై వికట్ సాగర్ సిమెంట్ కంపెనీలో విధులకు మంగళవారం వెళ్తున్నాడు. మార్గమధ్యంలో సెయింట్ మార్ఫ్స్ స్కూల్ సమీపానికి చేరుకోగానే, గౌతాపూర్ వైపు నుండి అతివేగంగా వచ్చిన ఎపి 39 టిపి 5770 నంబర్ గల ట్రాక్టర్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాధా కిషన్ రావు తలకు తీవ్ర గాయాలవ్వడంతో పాటు రెండు కాళ్లు విరిగిపోయాయి. స్థానికులు వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే రాధా కిషన్ రావు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి భార్య మనోజ్ఞ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటించి, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని పోలీసులు కోరారు.



# డంపింగ్ యార్డ్ ను విమర్శించడం ఎంతవరకు సమంజసం

## టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్



**మొయినాబాద్ :** ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ రెవెన్యూలో డంపింగ్ యార్డ్ నిర్మించింది ఏర్పాటు చేసింది అప్పటి బి.ఆర్.ఎస్ ప్రభుత్వం కాదా అని టిపిసిసి కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్ ఆరోపించారు ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ బి ఆర్ ఎస్ నాయకులు మంగళవారం నాడు హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలోని డంపింగ్ యార్డ్ కేంద్రాన్ని సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం చెత్తకుప్పల చేసిందని అనడానికి ఇది మీకు ఎంతవరకు సమంజసమని సూచించారు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో తడి చెత్త పొడి చెత్త ఏర్పాటు చేసే కేంద్రాన్ని నిర్మించి గ్రామాలలోని చెత్తను డంపింగ్ చేసింది మీ ప్రభుత్వం కాదా అని అన్నారు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ కేంద్రాన్ని చేసిందని చెప్పడానికి ఎలా చెప్తున్నారని డిమాండ్ చేశారు చెత్తను తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అదేవిధంగా ఈ ప్రాంతంలో కూరగాయల మార్కెట్ తో పాటు పూల మార్కెట్ను తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు ఈ సమావేశంలో జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ మహేందర్ ముదిరాజ్ మాజీ ఎంపీటీసీ పట్నం రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం అధ్యక్షుడుతోల్కట్ట వెంకటరెడ్డి. సాకలి శ్రీశైలం అమిత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# సీతారాంపేట్ హనుమాన్ దేవాలయం వద్ద బోరింగ్ మరమ్మతు

**తాండూరు జూన్ 9(జనంసాక్షి) :** స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద తాగునీటి బోరింగ్ చెడిపోయి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మంగళ, శనివారాల్లో దేవాలయానికి వచ్చే భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో నీటి కొరత సమస్యగా మారింది.విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించారు. మున్సిపల్ ఏఈ ఆదేశాల మేరకు సిబ్బంది బోరింగ్ మరమ్మతు పనులు చేపట్టారు. యుద్ధప్రాతిపదికన రిపేర్ పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు.దీంతో దేవాలయానికి వచ్చే భక్తులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన మున్సిపల్ ఏఈ, సిబ్బందికి స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## పేకాట ఆడుతూ పట్టుబడిన వారిపై కేసు



**జిల్లేడు చౌదరి గూడ (జనంసాక్షి) :** ఒక పొలం వద్ద పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై వివరాల మేరకు జిల్లేడు చౌదరిగూడ మండల పరిధి లాల్పాడు సమీపంలో ఒక పొలం వద్ద పేకాట ఆడుతూ 6 మంది పట్టుబడినారని తెలిపారు వారి నుంచి 60800 రూపాయల నగదు, 7 స్మార్ట్ ఫోన్లు సీజ్ చేశామని తెలిపారు పట్టుబడిన వారు పంది లింగం, నర్సింలు, హరి, హనుమంత్ రెడ్డి, బాలరాజు, చంద్రయ్యలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

# ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

## కౌన్సిలర్ మాధవియాది రెడ్డి



**చేవెళ్ల, జూలై 09 (జనంసాక్షి)** గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ మాధవి యాది రెడ్డి తెలిపారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో పుష్పగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ మాధవియాది రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి యాదిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుందని అన్నారు. మల్కాపూర్ వార్డులో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన వృద్ధులు, కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు, మహిళలు, ఇతర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ కంటి పరీక్షలు చేయించుకున్నారని అన్నారు. వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికి కంటి ఆరోగ్యంపై పరీక్షలు నిర్వహించి, సమస్యలను గుర్తించి తగిన సూచనలు అందించారని. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పుష్పగిరి ఫౌండేషన్ కోర్డినేటర్ త్రివేణి మాట్లాడుతూ.. కార్పొరేట్ స్థాయిలో వైద్య పరీక్షలు ఉంటాయని, పేదవారికి ఖర్చు లేకుండా వైద్య పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని అన్నారు . అనుభవజ్ఞులైె వైద్యులు శిబిరంలో కంటికి సంభందించిన అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందించామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి సంబంధిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల భవిష్యత్తులో పెద్ద సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు సూచించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవడం ద్వారా కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పించారు. ఈ ఉచిత శిబిరం ద్వారా గ్రామస్తులకు వైద్య సేవలు అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న గ్రామీణ ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పుష్పగిరి ఫౌండేషన్, సిబ్బంది త్రివేణి, యశ్వంత్ శివ, బాబు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి పథకం తెలుసుకునేందుకు కోట్‌పల్లి నుంచి పయనం




**కోట్ పల్లి జూన్ 09(జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి సదస్సుకు కోట్‌పల్లి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు మంగళవారం తరలివెళ్లారు. ఉదయం 8 గంటలకే గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్న మహిళలు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరారు. సర్పంచ్ జంగం బసమ్మ , మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య ఆధ్వర్యంలో మహిళలు ఈ సదస్సుకు హాజరయ్యారు. ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలు, రుణాలు, శిక్షణ కార్యక్రమాల గురించి తెలుసుకోవడానికి ఇది మంచి అవకాశం. మా గ్రామంలో ఇంకా చాలా మంది మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుంది" అని డ్వాక్రా సంఘం వారు తెలిపారు. ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాట్లాడుతూ....ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు వడ్డీలేని రుణాలు, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. కోట్‌పల్లి మహిళలు చైతన్యవంతంగా ముందుకు రావడం అభినందనీయం అని పేర్కొన్నారు. సదస్సులో రాష్ట్ర మంత్రులు, అధికారులు పాల్గొని మహిళా సంక్షేమ పథకాలను వివరించనున్నారు